# కలెక్టర్ ను కలిసిన ఎమ్మెల్యే రాగమయి

- నియోజకవర్గ అభివృద్ధి పై సమీక్ష



**సత్తుపల్లి మే 30 (ప్రజాజ్యోతి)** ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ను, సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ శనివారం ఆయన చాంబర్లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజక వర్గంలో ప్రతిపాదనలు,సంక్షేమ కార్యక్రమాలు, నిర్వహణ, అమలుపై చర్చించారు. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు ఇచ్చి, అభివృద్ధికి తోడ్పడాలని విన్నవించారు.


జాతీయ తెలుగు దినపత్రిక


# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## ఖమ్మం

ఆదివారం | 31 | మే | 2026 ◆ పేజీలు : 5




# మాదకద్రవ్యాలు, డ్రగ్స్ నియంత్రణ చాలెంజ్ గా తీసుకోవాలి

**- డిజిపి సివి ఆనంద్**

**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి** రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగం అత్యంత ప్రాధాన్యతనిస్తున్నాయని రాష్ట్ర డీజీపీ సివి ఆనంద్ అన్నారు.పోలీస్ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫిరెన్ లో డీజీపీ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు, డ్రగ్స్ నియంత్రణను ఛాలెంజ్ తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.ప్రస్తుత పరిస్థితులలో మాదకద్రవ్యాలను వినియోగం కట్టడి చేయకుంటే యువత భవిష్యత్తు దెబ్బతింటుందన్నారు. జిల్లాలోని

మిగతా 2 లో...

# రోడ్డుకు అడ్డంగా నేలకొరిగిన మహావృక్షం




- తప్పిన భారీ ప్రమాదం
- 2 గంటలపాటు వాహనాల రాకపోకలకు అంతరాయం
- జెసిపి సహాయంతో చెట్టును తొలగించిన ఎస్సై పొదిలి వెంకన్న
- శభాష్ పోలీస్ బాస్ అంటూ ఎస్సైను అభినందించిన వాహనదారులు

**బోనకల్, మే 30 (ప్రజాజ్యోతి):** మండల పరిధిలోని రావినూతల – జానకిపురం గ్రామాల మధ్య వైరా – జగ్గయ్యపేట ప్రధాన రహదారిపై శనివారం ఉదయం 10 గంటల సమయంలో 100 సంవత్సరాల చరిత్ర గల మర్రి మహా వృక్షం

మిగతా 2 లో...

# అన్ని రంగాల్లో మధిర పట్టణాన్ని అభివృద్ధి చేస్తాం..

- అభివృద్ధి పనుల పర్యవేక్షణలో స్థానికులు భాగస్వామ్యం కావాలి
- ముస్లిం ఖాభారస్థాన్ కు వెళ్లే సిసి రోడ్ శంకుస్థాపన కార్యక్రమంలో చైర్మన్ సుజాత



**మధిర ప్రజా జ్యోతి** మధిర పట్టణంలో 4వ వార్డుల్లో నందిగామ బైపాస్ మెయిన్ రోడ్ నుండి ముస్లిం ఖాభారస్థాన్ వరకు రూ.50 లక్షలతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు (సిమెంట్ కాంక్రీట్ రోడ్డు)పనులకు మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత స్థానిక కౌన్సిలర్లు,అధికారులతో కలిసి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ సుజాత మాట్లాడుతూ,మధిర పట్టణాన్ని డిప్యూటీ సీఎం

మిగతా 2 లో...

# ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులను సన్మానించిన పోలీస్ కమిషనర్



**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి** ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులకు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పూలమాలలు, శాలులతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా వివిధ విభాగాలలో భాద్యతయుతమైన విధులు నిర్వహించి పోలీస్ శాఖ కు ఎనలేని సేవలందించారారని పోలీస్ కమీషనర్ కొనియాడారు. విధినిర్వహణలో తోడ్పాటు అందించిన కుటుంబ సభ్యులనుఈ సందర్భంగా అభినందించారు. పదవి విరమణ చేసిన మీరు ఇకపై కుటుంబ సభ్యులతో అనందంగా భావి జీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. ఉద్యోగ విరమణ పొందిన బి. నాగేశ్వర్ రావు, ఎస్సై డబల్ యు పి ఎస్ ,ఎన్ .ఉప్పయ్య, ఏఎస్ఐ ఖమ్మం రెండవ టౌన్ ఎం . గురునాధం,ఏ ఎస్ ఐ ముదిగొండపి . ప్రకాష్ రావు, హెచ్ సి మదిర టౌన్ పి. లక్ష్మణ్ రావు ఎస్సై కమ్యూనికేషన్ కార్యక్రమంలో ఏ ఆర్ ఏసీపీ నర్సయ్య,ఆర్ ఐ లు కామరాజు, అసోసియేషన్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## రోడ్డుకు అడ్డంగా నేలకొరిగిన మహా వృక్షం



(మొదటి పేజీ తరువాయి...)

ఒక్కసారిగా నేలకొరిగింది. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రధాన రహదారిపై ఒక్కసారిగా మహావృక్షం రోడ్డుకు అడ్డంగా నేలమట్టం కావడంతో ఈ ఘటనతో వాహనదారులలో భయాందోళన నెలకొంది. అదృష్టవశాస్తు ఘటన జరిగిన సమయంలో ప్రధాన రహదారిపై ఎటువంటి వాహనాలు రాకపోవడంతో భారీ ప్రమాదం తప్పింది. దీనితో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు. దీనితో వాహనాల రాకపోకలకు సుమారు 2 నుంచి 3 గంటలపాటు అంతరాయం ఏర్పడింది. భారీగా వాహనాలు నిలిచిపోయాయి. వెంటనే స్థానికులు బోనకల్ ఎస్సై పొదిలి వెంకన్నకు సమాచారం అందించారు. స్పందించిన ఎస్సై తన సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకున్నారు. వెంటనే జెసిబి సహాయంతో రోడ్డుకు అడ్డంగా నేలకొరిగిన మహా వృక్షాన్ని బోనకల్ ఎస్సై పోదిలి వెంకన్న ఒక అధికారిగా కాకుండా మానవతా దృక్పథంతో ప్రజల మనిషిగా మండే ఎండను సైతం లెక్కచేయకుండా రెండు గంటలపాటు శ్రమించి నేలకొరిగిన మహా వృక్షాన్ని తొలగించే కార్యక్రమం తనే స్వయంగా తమ సిబ్బందితో కలిసి దగ్గరుండి మహావృక్షాన్ని తొలగించే కార్యక్రమం చేపట్టారు. ఆ తరువాత మళ్లీ యధావిధిగా వాహనాల రాకపోకలు కొనసాగాయి. ఇంత చాకచక్యంగా శ్రమించి రెండు గంటలపాటు తనే స్వయంగా దగ్గరుండి చెట్టును తొలగించే కార్యక్రమం చేపట్టడంతో వాహనదారులు శభాష్ పోలీస్ బాస్ అంటూ బోనకల్ ఎస్సై పొదిలి వెంకన్నను అభినందించారు. ప్రతి ఒక్కరు మానవతా దృక్పథంతో పనిచేయాలని ఆయన కోరారు.

## మాదకద్రవ్యాలు, డ్రగ్స్ నియంత్రణ చాలెంజ్ గా తీసుకోవాలి

(మొదటి పేజీ తరువాయి...)

రెసిడెన్షియల్ విద్యాసంస్థలు,ప్రభుత్వ, ప్రైవేట్ హాస్టళ్లలో విద్యార్థుల అలవాట్లను పర్యవేక్షించాలని, విద్యాసంస్థల పరిసర ప్రాంతాల్లో డ్రగ్స్ ,మాదకద్రవ్యాల సరఫరా జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. డ్రగ్స్ వల్ల కలిగే విపరీత పరిణామాలపై ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు, వాటి నియంత్రణకు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.సాధారణ దొంగతనం కేసుల కంటే సైబర్ నేరాలు చాలా వేగంగా పెరుగుతున్నాయని,సమాజంలో మారుతున్న సాంకేతికతను వాడుకుంటూ సైబర్ నేరగాళ్ళు వేల కోట్లు దోచుకుంటున్న నేపథ్యంలో పోలీస్ అధికారులు సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్ని ప్రజలను చైతన్యం పరచాలని సూచించారు.రోడ్డు ప్రమాదాలను నివారించడానికి, ప్రాణ నష్టాన్ని తగ్గించడానికి రహదారి భద్రతను మెరుగుపరచడానికి, వాహనాల రాకపోకలను సులభతరం చేయడానికి ట్రాఫిక్ మేనేజ్ మెంట్ ఖచ్చితమైన అమలు చేయాలన్నారు.మహిళలు,చిన్నారుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ లైంగిక వేధింపులు, గృహహింస, సైబర్ నేరాలు వంటి సమస్యలను అరికట్టడానికి షీ టీమ్స్ భరోసా కేంద్రాలు వంటి ప్రత్యేక విభాగాలు నిరంతరం పనిచేయాలని అన్నారు.విజిబుల్ పోలీసింగ్ ద్వారా రాత్రి వేళల్లో గస్తీ, కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు, విస్తృత వాహన తనిఖీలు చేపట్టాలన్నారు.సమాజంలో శాంతిభద్రతలను కాపాడే పోలీసు వ్యవస్థకు పారదర్శకత అనేది అత్యంత ప్రాముఖ్యమైనదని, ఇది వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని పెంపొందిస్తుందన్నారు.నేర రహిత సమాజం, కఠినమైన చట్టాల అమలు కోసం పోలీసు యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండటం అవసరమని అన్నారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పలు అంశాలపై వివరించారు.

## కారేపల్లిలో నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

**కారేపల్లి, మే 30, ప్రజాజ్యోతి:** సింగరేణి మండల కేంద్రమైన కారేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నేడు ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక మండల బాధ్యుడు బాలిన వెంకటరెడ్డి శనివారం ఒక ప్రకటన తెలిపారు. సుమన్ ఐ కేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం నిర్వహించబడని ఈ శిబిరంలో దూరపు చూపు,దగ్గర చూపు, మసక, కంటి దురదలు, కంటిలో శుక్లాలు వంటి సంబంధిత వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేయనునట్లు ఆయన తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సచేసి కండజోళ్ళు పంపిణీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని మండల పరిధిలోని ప్రజలు కంటి సమస్య ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

# కష్టానికి ఫలితం ర్యాంకులు బెటాలియన్ దళాధిపతి అంజయ్య

- **పాలీసెట్ స్టేట్ ఫస్ట్ ర్యాంకర్ అర్భాజ్ అలీకి ఘన సన్మానం**



**సత్తుపల్లి మే30(ప్రజా జ్యోతి)** ర్యాంకుల కోసం మాత్రమే కాకుండా, విద్యార్థుల కృషి, అంకితభావం, క్రమశిక్షణ మరియు పనితీరు ఆధారంగానే అత్యుత్తమ ఫలితాలు సాధ్యమవుతాయని 15వ పోలీస్ బెటాలియన్ దళాధిపతి అంజయ్య తెలిపారు.ఇటీవల విడుదలైన తెలంగాణ పాలీసెట్–2026 ఫలితాలలో సత్తుపల్లికి చెందిన ఓ ప్రైవేట్ పాఠశాల విద్యార్థి ఎం.డి. అర్భాజ్ అలీ 120కి 120 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంక్ పొందిన సందర్భంగా, గంగారం 15వ పోలీస్ బెటాలియన్‌లో ప్రత్యేక అభినందన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా అర్భాజ్ అలీతో పాటు ఆయన తండ్రి అఫ్జల్ శాలువాలు, జ్ఞాపికలు మరియు పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా దళాధిపతి అంజయ్య మాట్లాడుతూ, అర్భాజ్ ప్రతిభను కొద్ది నెలల క్రితమే గుర్తించి అభినందించడం జరిగిందని తెలిపారు. జీవితంలో ఉన్నత లక్ష్యాలను చేరుకోవడానికి వినయం, విలువలు, అంకితభావం మరియు కఠోర శ్రమ అత్యంత అవసరమని పేర్కొన్నారు.విద్యార్థుల విజయాల్లో ఉపాధ్యాయుల ప్రోత్సాహం, తల్లిదండ్రుల సహకారం కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. విద్య భవిష్యత్తుకు బలమైన పునాది అని పేర్కొంటూ, ప్రతి విద్యార్థి స్పష్టమైన లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బెటాలియన్ అధికారులు వెంకట గోపాల్, ఉదయ్ కుమార్ తదితరులు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రామికులను ఐక్యం చేయడం కోసమే సీఐటీయూ ఆవిర్భావం"

- **పాలకుల విధానాలపై పోరు చేయండి: మల్లూరు చంద్రశేఖర్(సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి)**



**వేంసూరు,మే30 ప్రజాజ్యోతి న్యూస్:** ఖమ్మంజిల్లా వేంసూరు మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట సీఐటీయూ 56 వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు.జెండా ఆవిష్కరణ చేశారు.సీఐటీయూ జిందాబాద్,కార్మికుల ఐక్యత,పోరాటాలు వర్ధిల్లాలి,జోహార్ అమరవీరులకు అంటూ దిక్కులు పిక్కటిల్లేలా నినదించారు.ఈ సందర్భంగా పాల్గొన్న సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లూరు చంద్రశేఖర్ మాట్లాడుతూ దేశంలో తమ శ్రమశక్తిని నమ్ముకొని తమ రక్తాన్ని, స్వేదాన్ని పణంగా పెట్టీ దేశ జీడీపీ వృద్ధికి దోహదపడుతున్న శ్రామిక వర్గాన్ని ఐక్యం చేసి హక్కుల సాధనకు,దేశంలో కార్మిక రాజ్య స్థాపన చేయడం కోసమే 1970మే 30 న సీఐటీయూ ఆవిర్భావం జరిగిందన్నారు.నాటి నుండి నేటి వరకు దేశంలో కార్మికులు,కర్షకులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తూ ఎన్నో విజయాలు సాధించడం జరిగిందన్నారు.

అఖిలభారత స్థాయిలో అన్ని కార్మిక సంఘాలను ఒక తాటిపైకి తీసుకొచ్చి దేశ వ్యాప్త సమ్మెలు నిర్వహించిన నిర్వహిస్తున్న ఘనత సీఐటీయూ దేనని వివరించారు.తెలంగాణ రాష్ట్రంలో ఐకెపి పరిధిలో గ్రామాలలో మహిళలకు ప్రజలకు చేరువుగా ఉంటూ పని చేస్తున్న విఓఏ లు గత 12 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకుండా తాత్సారం చేయడం తగదని వెంటనే పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు.

విఓఏ లకు సీఐటీయూ అండగా ఉంటుందని హామీనిచ్చారు.ఈ కార్యక్రమంలో: తుంగా నాగరాజు,లింగాల కృష్ణ,అబ్బోజు నాగమణి, సీతారత్నం, నాగలక్ష్మి,పిల్లి జ్యోతి, రమాదేవి, కిన్నెర సద్గుణ, రవికుమారి తదితరులు పాల్గొన్నారు.

## మంటలు పెట్టడం వల్ల ప్రమాదాలు జరిగితే కఠిన చర్యలు

- **బోనకల్ ఎస్సై పొదిలి వెంకన్న**



**బోనకల్, మే 30(ప్రజా జ్యోతి):** ఇటీవల పొలాల్లో పంట అవశేషాలు, చెత్త, పొదలు, చెట్ల వేర్లను కాల్చడం వల్ల పెద్ద చెట్లు బలహీనపడి రోడ్లపై అడ్డంగా పడిపోతున్నాయి. దీనివల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలగడంతో పాటు వాహనాలపై చెట్లు పడే ప్రమాదం ఉండి, ప్రాణనష్టం సంభవించే అవకాశం ఉంది. మంటలు పెట్టడం వల్ల ఎటువంటి ప్రమాదాలు జరిగిన సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకొనబడతాయని బోనకల్ ఎస్సై పొదిలి వెంకన్న అన్నారు. అందువల్ల రైతులు క్రింది జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి. రహదారుల పక్కన ఉన్న చెట్ల వేర్ల వద్ద లేదా సమీపంలో మంటలు పెట్టకూడదన్నారు. పొలాల్లో చెత్త, పొదలు, ఎండిన కొమ్మలను కాల్చేటప్పుడు పూర్తి భద్రతా చర్యలు తీసుకోవాలనీ, రోడ్డు పక్కన ప్రమాదకర స్థితిలో ఉన్న చెట్లు కనిపిస్తే వెంటనే సంబంధిత అధికారులకు లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. చెట్లు రహదారిపై పడే అవకాశం ఉన్నట్లయితే ముందస్తుగా అధికారులకు తెలియజేసి తొలగించే చర్యలు చేపట్టాలనీ అన్నారు. నిర్లక్ష్యంగా మంటలు పెట్టడం వల్ల ప్రమాదాలు జరిగితే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయనీ తెలిపారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణ అందరి బాధ్యత. రైతులు సహకరించి ప్రమాదాలను నివారించాలని కోరారు.

## అన్ని రంగాల్లో మధిర పట్టణాన్ని అభివృద్ధి చేస్తాం



(మొదటి పేజీ తరువాయి...)

భట్టి విక్రమార్క సహకారంతో అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. వార్డుల్లో డ్రైనేజీ, సిసి రోడ్ల వంటి కనీస వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు.కాంట్రాక్టర్లు నిర్మాణ పనుల్లో ఖచ్చితంగా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, నిర్దేశిత గడువులోగా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు.మున్సిపాలిటీ అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలని, పనుల పర్యవేక్షణలో స్థానికులు చొరవ చూపాలని కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, వైస్ చైర్మన్ కోన దని కుమార్,కౌన్సిలర్లు దోర్నాల శిరీష,బోడెపుడి రేవతి, షేక్ రషీదున్,నకిరికంటి భాగ్యలక్ష్మి,వంకాయలపాటి వెంకట నాగేశ్వరరావు, ములకలపల్లి వినయ్ కుమార్,తెలుగుదేశం పార్టీ నాయకులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, కాంగ్రెస్ పార్టీ నాయకులు వేమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, సిపిఐ నాయకులు బెజవాడ రవిబాబు,కాంగ్రెస్ నాయకులు రంగా శ్రీనివాసరావు,పారుపల్లి విజయ్ కుమార్,తలుపుల వెంకటేశ్వర్లు,మిర్యాల వెంకటరమణ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధుల సంక్షేమానికి బోనకల్‌లో ప్రత్యేక వేదిక

- సీనియర్ సిటిజన్స్ ల విశ్రాంతి, వినోదం కోసం
- వృద్ధుల సేవా కేంద్రం ఏర్పాటుకు చర్యలు
- సీనియర్ సిటిజన్స్ ప్రశాంతంగా కాలక్షేపంగా ఉండడానికే వినోద సేవ కేంద్రం
- బోనకల్ గ్రామ సర్పంచ్ బానోతు జ్యోతి, ఉప సర్పంచ్ బానోతు కొండ



**బోనకల్, మే 30(ప్రజా జ్యోతి):** సమాజానికి జీవితాంతం సేవలందించిన వృద్ధులు ప్రశాంతంగా కాలక్షేపం చేయడంతో పాటు పరస్పరం కలుసుకుని తమ అనుభవాలను పంచుకునేందుకు బోనకల్ మండల కేంద్రంలో ప్రత్యేక వృద్ధుల సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ముమ్మర చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా బోనకల్‌లోని నీటి పారుదల శాఖ కార్యాలయంలో ఖాళీగా ఉన్న ఒక గదిని వృద్ధుల కోసం కేటాయించే అవకాశాలను బోనకల్ గ్రామ సర్పంచ్ బానోతు జ్యోతి , ఉప సర్పంచ్ బానోతు కొండ ,అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సీనియర్ సిటిజన్స్ ప్రతిరోజూ ఒకేచోట సమావేశమై స్నేహపూర్వక వాతావరణంలో సమయం గడపడం, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించుకోవడం, సామాజిక అంశాలపై చర్చించుకోవడం వంటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు సర్పంచ్ భాను జ్యోతి కొండ తెలిపారు. ఇందుకోసం అనువైన స్థలంగా నీటిపారుదల శాఖ కార్యాలయంలో ఖాళీగా ఉన్న గదిని పరిశీలించి, దానిని అధికారికంగా కేటాయించేందుకు చేపట్టాల్సిన తదుపరి చర్యలపై అధికారులతో కలిసి చర్చిస్తున్నామన్నారు. అదే విధంగా వృద్ధులు సమాజానికి మార్గదర్శకులని, వారికి ప్రత్యేక వేదిక కల్పించడం ద్వారా వారి అనుభవాలు యువతకు ఉపయోగపడటంతో పాటు వృద్ధులలో ఒంటరితనాన్ని తగ్గించవచ్చని పేర్కొన్నారు. వృద్ధుల సంక్షేమానికి ఈ కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీవో షకీరా బేగం, బోనకల్ పంచాయతీ కార్యదర్శి కోలా రాజేశ్వరి, అంగన్వాడీ టీచర్ మిరియాల రమాదేవి, బోనకల్ గ్రామ పెద్దలు గుండపనేని సుధాకర్ రావు, తెల్లూరి రమేష్, గూగులోత్ నాగేశ్వర్ రావు, యార్లగడ్డ శ్రీను, గుంగుల పుల్లయ్య, వి. నరసింహారావు, మల్లెల వేలాద్రి, మరీదు శేషు, నారపోగు టైగర్ తదితరులు పాల్గొన్నారు.

# రేపటి నుంచి జీలుగులు, జనుము విత్తనాలు పంపిణీ



**నేలకొండపల్లి, మే 30 ప్రజా జ్యోతి :** మండలం లోని పచ్చిరొట్ట విత్తనాలు జీలుగులు, జనుము విత్తనాలను సోమవారం నుంచి పంపిణీ చేయనున్నట్లు నేలకొండపల్లి మండల వ్యవసాయాధికారి యం.రాధ తెలిపారు. మండల కేంద్రం లోని తన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు...సోసైటీలలో విత్తనాలను అందించనున్నట్లు తెలిపారు. సబ్సిడీ పై అందించే విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బోదులబండ సోసైటీలో 49.80 క్వింటాల జీలుగులు, రామచంద్రాపురం సోసైటీ లో 49.80 క్వింటాలు, రాజేశ్వరపురం లో 199.80 క్వింటాల, చెన్నారం సోసైటీ లో 49.80 క్వింటాల మంగ్రాజుపల్లి.. సోసైటీ లో 60 క్వింటాలు, మోటాపురం 60 క్వింటాలు, నాచేపల్లి –సోసైటీలో 45 క్వింటాలు, నేలకొండపల్లి సోసైటీలో 99 క్వింటాలు. · రాజారాం పేట 60 క్వింటాలు జీలుగులు ఉన్నట్లు తెలిపారు. మంగ్రాజుపల్లి సోసైటీ లో 10 క్వింటాల జనుములు, మోటాపురం సోసైటీలో 10 క్వింటాల జనుము, రాజారాం పేట సోసైటీలో 10 క్వింటాలు, నేలకొండపల్లి సోసైటీలో 10 క్వింటాల జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. జీలుగులు 30 కేజీల బస్తా, రూ.4905 ధర కు 50 శాతం సబ్సిడీ పై రూ.2453 రైతు చెల్లించాల్సి ఉందని తెలిపారు. జనుము 40 కేజీల బస్తా ధర రూ.6220 ఉండగా, 50 శాతం రాయితీ రూ.3110 రైతు చెల్లించాలని తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులు పాస్పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ లు తీసుకుని సోసైటీ వద్ద విత్తనాలను పొందాలని సూచించారు.

# వివో ఏ లకు ఉద్యోగ భద్రత కల్పించాలి



- వివో ఏలకు స్థిరమైన ఉద్యోగ హక్కులు కల్పించాలని
- బోనకల్ గ్రామ సర్పంచ్ బానోత్ జ్యోతి, ఉప సర్పంచ్ బానోతు కొండ

**బోనకల్, మే 30(ప్రజా జ్యోతి):** గ్రామీణ పేదరిక నిర్మూలన, మహిళా సంఘాల బలోపేతం, స్వయం సహాయక సంఘాల నిర్వహణ, బ్యాంకు అనుసంధానం, సంక్షేమ పథకాల అమలులో కీలక పాత్ర పోషిస్తున్న గ్రామ స్థాయి కార్యకర్తలకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ వీఓఏలు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం ఆరవ రోజుకు చేరుకుంది. మండల కేంద్రంలో కొనసాగుతున్న తహసిల్దార్ కార్యాలయం ముందు ఈ సమ్మెలో వీఓఏలు తమ న్యాయమైన హక్కుల సాధన కోసం పెద్ద ఎత్తున పాల్గొని ప్రభుత్వానికి తమ గోడును వినిపించారు. సమ్మె సందర్భంగా వీఓఏలు మాట్లాడుతూ... ఎన్నో సంవత్సరాలుగా గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘాల అభివృద్ధి కోసం కష్టపడి పని చేస్తున్నప్పటికీ తమకు సరైన వేతనం, ఉద్యోగ భద్రత కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గౌరవ వేతనం పేరుతో జీవనోపాధి సాగించడం కష్టంగా మారిందని, కుటుంబ పోషణ భారంగా మారిందని తెలిపారు. వారి ప్రధాన డిమాండ్లలో నెలకు రూ.26 వేల కనీస వేతనం, సంస్థ ఉద్యోగులుగా గుర్తింపు, ఉద్యోగ భద్రత, అర్హులైన వారికి పదోన్నతులు, సామూహిక ఆరోగ్య బీమా సౌకర్యం, కార్యనిర్వహణకు అవసరమైన నెట్ సౌకర్యం కల్పించడం, సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వులలో సవరణలు చేయడం వంటి అంశాలు ఉన్నాయన్నారు. ఈ సమ్మెకు బోనకల్ గ్రామ సర్పంచ్ బానోత్ జ్యోతి, ఉప సర్పంచ్ బానోతు కొండ సమ్మె శిబిరాన్ని సందర్శించి వీఓఏల ఉద్యమానికి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బానోత్ జ్యోతి కొండ మాట్లాడుతూ...వీఓఏలు గ్రామాల్లో స్వయం సహాయక సంఘాల ఏర్పాటు, పొదుపు కార్యక్రమాలు, రుణాల అనుసంధానం, సంక్షేమ పథకాల అమలు, వివిధ రకాల సమాచార సేకరణ, ఎన్నికల సమయంలో ప్రభుత్వ విధులు వంటి అనేక బాధ్యతలను నిర్వర్తిస్తున్నప్పటికీ వారికి తగిన గుర్తింపు దక్కడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల వారి సేవలకు తగిన గౌరవం, స్థిరమైన ఉద్యోగ హక్కులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామీణాభివృద్ధికి వీఓఏలు చేస్తున్న సేవలు అమూల్యమని, వారి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి వెంటనే పరిష్కరించాలని వారు కోరారు. సమ్మెలో పాల్గొన్న వీఓఏలు “ఉద్యోగ భద్రత మా హక్కు”, “గౌరవ వేతనం కాదన్నారు. కనీస వేతనం కావాలినీ, శ్రమకు తగిన ప్రతిఫలం ఇవ్వాలనీ నినాదాలు చేస్తూ తమ పోరాటాన్ని కొన సాగించారు. తెల ంగాణ ప్రభుత్వం వెంటనే స్పందించి వారి న్యాయమైన కోరికలను పరిష్కరించాలని సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో బోనకల్ సహకార సంఘం మాజీ అధ్యక్షులు గుండపనేని సుధాకర్ రావు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు తేళ్లూరి రమేష్, మరీదు శేషు, గంగుల పుల్లయ్య, ఒరుగు నరసింహారావు, టైగర్, మల్లెల యాలాద్రి , పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

# ప్రయాణికులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ

- ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ చేసిన దాతలు



**బోనకల్, మే 30 (ప్రజా జ్యోతి):** మండల కేంద్రంలోని స్థానిక ఖమ్మం బస్టాండ్ సెంటర్లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శనివారం ప్రయాణికులకు ప్రజలకు ఉచితంగా దాతలు మజ్జిగ పంపిణీ చేశారు. మండల పరిధిలోని ముష్టికుంట గ్రామానికి చెందిన కటకం పురుషోత్తం కోటి రత్నాలు జ్ఞాపకార్థం వారి కుమారుడు కటకం శ్రీనివాసరావు కళ్యాణి దంపతులు, మనవళ్లు, మనవరాళ్లు కార్తీక్, రూప, లావణ్య, రత్నాకర్, రమ్యశ్రీ మజ్జిగను ఉచితంగా పంపిణీ చేశారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మే 1వ తేదీ నుంచి మే చివరిదాకా వేసవి మండుటెండల నేపథ్యంలో ప్రతి ఆర్య వైశ్య సంఘం కుటుంబం ఒక రోజు మజ్జిగను ఉచితంగా పంపిణీ చేయాలని నిర్ణయించారు. అందులో భాగంగా కటకం శ్రీనివాసరావు కుటుంబం మజ్జిగ పంపిణీ చేసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండుటెండల కారణంగా ప్రయాణికులకు ఉడతభక్తిగా తాము ఉచితంగా మజ్జిగను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. సామాజిక స్పృహలో భాగంగా తాము ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు పల్లపోతుల వెంకట గోపాల రావు, వెచ్చా సీతారామయ్య, తెల్లాకుల రజిని, ఇమ్మడిశెట్టి రామకోటేశ్వర రావు, దాతలు కటకం శ్రీనివాసరావు లావణ్య దంపతులు తదితరులు పాల్గొన్నారు.

## నగర కాంగ్రెస్ కమిటి మాజీ అధ్యక్షులు మహ్మద్ జావేద్ సంస్మరణ సభను జయప్రదం చేయగలరు

- జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ఒకప్రకటనలో మాట్లాడుతూ నేడు ఖమ్మం నగరంలోని స్వర్గీయ మహ్మద్ జావేద్ సంస్మరణ సభకు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, ఏ ఐ సి సి కార్యదర్శి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మీనాక్షి నటరాజన్,తెలంగాణ రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, జిల్లా ఇంచార్జి మంత్రి వాకిటి శ్రీహరి, నీటి పారుదల, ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి,రెవెన్యూ,గృహనిర్మాణ ,సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి,వ్యవసాయ ,మార్కెటింగ్ ,చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి శాసనసభ సభ్యులు, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ లు హాజరవుతారని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ తెలియజేసారు.శ్రేణులు అందరు విచ్చేసి కార్యక్రమమును జయప్రదం చేయగలరు.

## ఖమ్మం జిల్లా గ్రంథాలయ సంస్థకు రూ.2.00 కోట్ల గ్రంథాలయ సెస్ నిధుల విడుదలకు మున్సిపల్ కమిషనర్ హామీ



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఖమ్మం జిల్లా గ్రంథాలయ సంస్థకు ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వసూలు చేసిన గ్రంథాలయ సెస్ నిధులలో పెండింగ్‌లో ఉన్న మొత్తాన్ని విడుదల చేయాలని కోరుతూ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.డి. ఖాదర్ బాబా , కార్యదర్శి కె. కరుణ కుమారి,కార్యాలయ సిబ్బంది వి. అఖిల్, జె. భాస్కర్ రావులు ఖమ్మం మున్సిపల్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ పరిధిలోని కేంద్ర, శాఖ మరియు గ్రామీణ గ్రంథాలయాల నిర్వహణకు గ్రంథాలయ సెస్ ప్రధాన ఆదాయ వనరుగా ఉన్నందున పెండింగ్ నిధులను విడుదల చేయడం అత్యవసరమని వివరించారు.గ్రంథాలయాల నిర్వహణ,పాఠకులకు మెరుగైన సేవలు, మౌలిక వసతుల అభివృద్ధి కోసం నిధుల అవసరాన్ని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.వినతిపై సానుకూలంగా స్పందించిన ఖమ్మం మున్సిపల్ కమిషనర్, ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న గ్రంథాలయ సెస్ నిధులలో రూ.2.00 కోట్లను త్వరలోనే జిల్లా గ్రంథాలయ సంస్థ ఖమ్మం ఖాతాకు బదిలీ చేయనున్నట్లు హామీ ఇచ్చారు . మున్సిపల్ కమిషనర్ ఇచ్చిన హామీ పట్ల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.డి.ఖాదర్ బాబా హర్షం వ్యక్తం చేస్తూ,గ్రంథాలయాల అభివృద్ధికి సహకరిస్తున్న మున్సిపల్ కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## మోసాలకు పాల్పడుతున్న నిందుతుడు అరెస్ట్ రిమాండ్ తరలిపింపు



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** కాకినాడ జిల్లా కిర్లంపూడి గ్రామానికి చెందిన ఎన్టిపిసి రామగుండం మాజీ ఉద్యోగి తోట బాలాజీ నాయుడు అనే వ్యక్తి పరిచయమై తనకు చాలామంది పరిచయస్తులు ఉన్నారని వారి ద్వారా లోన్లు ఇప్పిస్తాను అని చెప్పగా పువ్వాడ ఉదయ నగర్ గ్రామం రఘునాథ పాలెం మండలం కు చెందిన వడ్లకుంట శివ అనే వ్యక్తి కుటుంబ అవసరాల నిమిత్తం 10 లక్షల రూపాయలు అవసరం ఉన్నదని, ఇప్పించమని తోట బాలాజీ నాయుడు ని అడుగగా అతను అట్టిలోను ఇప్పించుట గురించి మూడు లక్షల రూపాయలు ఖర్చు అవుతాయని చెప్పగా వడ్లకుంట శివ ఖమ్మానికి చెందిన తన స్నేహితుల ద్వారా రెండు లక్షల 50 వేల రూపాయలు ఫోన్ పే ద్వారా తోట బాలాజీ నాయుడు కి పంపినాడు.సదరు తోట బాలాజీ నాయుడు గతంలో ఎన్టిపిసి రామగుండం నందు ఏఈ గా పని చేస్తూ.. ఏసీబీ సిబిఐ వారికి లంచం తీసుకుంటూ దొరికి ఉద్యోగం నుండి తీసివేయబడినాడు. అప్పటి నుండి రెండు తెలుగు రాష్ట్రాలలో ఉన్న నాయకులు లకు ఫోన్ చేసి నేను అడిషనల్ సెక్రెటరీ, ఫైనాన్స్ డిపార్ట్మెంట్, అని ఫోన్ చేసి చెప్పి ప్రధానమంత్రి వికసిత్ భారత్ రోజ్ గార్ యోజన మరియు చీఫ్ మినిస్టర్ అన్ ఎంప్లాయిమెంట్ స్కీమ్ కు సంబంధించి మీ నియోజకవర్గానికి ఫండ్స్ వచ్చినవి అని మీ నియోజకవర్గ నుండి అప్లికేషన్లు పంపండి మనిషికి 2500 రూపాయలు చలానాగా కట్టాలి నేను స్కానర్ పెడతాను పదిమందికి 25 వేల రూపాయలు చొప్పున మీరు ఎంతమందికి కావాలో అన్ని డబ్బులు నేను పెట్టిన స్కానర్ కు కొట్టమని డబ్బులు కొట్టించుకునేవాడు. సదరు తోట బాలాజీ నాయుడు గతంలో 2016 వ సంవత్సరంలో బంజారాహిల్స్ పోలీసు పిడి యాక్ట్ పెట్టి చంచల్ గూడ జైలుకి పంపినారు. అదేవిధంగా 2025 సంవత్సరంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ఫోన్ చేసి డబ్బులు తీసుకుని అట్టి కేసులో కూడా జైలుకు పోయి వచ్చినాడు. సదరు బాలాజీ నాయుడు రెండు రాష్ట్రాల్లో ఉన్న నాయకులని లక్ష్యంగా చేసుకొని వారి వద్ద నుండి మోసపూరితంగా డబ్బులు తీసుకుంటూ అదే విధంగా రఘునాధపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని పువ్వాడ ఉదయ నగర్ కు చెందిన వడ్లకుంట శివ అనే వ్యక్తిని కూడా మోసం చేసి రెండు లక్షల 50 వేల రూపాయలు నగదును క్యూఆర్ కోడ్ స్కానర్లు పెట్టి మోసపూరితంగా డబ్బులు తీసుకున్నాడు. ఇట్టి కేసుని రఘునాధపాలెం పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎండి ఉస్మాన్ షరీఫ్ కేసు నమోదు చేయడం జరిగింది. ప్రస్తుతం చించు పేట, జండా చెట్టు బజార్, తెనాలి తాలూకా, గుంటూరు జిల్లాలో నివాసం ఉంటునట్లు విచారణ నిందుతుడు తెలిపారు.నిందుతుడిని శనివారం అరెస్ట్ చేసి రిమాండ్ తరలించడం జరిగింది అన్నారు.

## ట్రాప్ కేసులో నేలకొండపల్లి పూర్వ తహసిల్దారు నరసింహారావుకు జైలు శిక్ష

**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి** 2011లో నేలకొండపల్లి తహసిల్దారుగా పనిచేస్తున్న గుండ్ల నరసింహారావు వ్యవసాయ భూమికి ఎన్ఓసి జారీ చేయడానికి మూడు వేల రూపాయలు లంచం అడిగగా,దీంతో బాధితుడు డు ఏసీబీ ని సంప్రదించాడు. ఎసిబి.సిఐ వెంకటేష్ ఆధ్వర్యంలో 2011లో తాసిల్దార్ ను అరెస్ట్ చేశారు. అనంతరం శుక్రవారం 2026 మే 29వ తేదీన తాసిల్దార్ కు వరంగల్ ఏసీబీ కోర్టు జడ్జ్ కే దేశ్ పాండే రెండు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష పదివేల రూపాయల జరిమానా విధించారు. ఈ ప్రాసిక్యూషన్కు ప్రస్తుత ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎసిబి డిఎస్పి వై రమేష్, సిఐ శేఖర్, ఈ కేసులో పిపి జ్యోతి రెడ్డి,కోర్ట్ కానిస్టేబుల్ నరసింహారావు తదితరులు సహకరించారు.

## బోనకల్ తహసిల్దార్ గా సిహెచ్ సుధాకర్.?



**బోనకల్, మే 30 (ప్రజా జ్యోతి ):** బోనకల్ మండల తహసిల్దారుగా సిహెచ్ సుధాకర్ నియమితులైనట్లు విశ్వసనీయ సమాచారం.? బోనకల్ తహసిల్దారుగా పనిచేస్తున్న మద్దెల రమాదేవి పదోన్నతితో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గా నల్లగొండ జిల్లాకు బదిలీ అయ్యారు. ఆ తర్వాత బోనకల్ తహసీల్దారుగా కామేపల్లి మండల తాహసిల్దార్ సిహెచ్ సుధాకర్ బోనకలకు బదిలీపై వస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం తెలిసింది.

## పంచర్ షాప్ దగ్నంతో బ్రతుకు రోడ్డుపై పడ్డదని కార్మికుడు ఆవేదన



**చింతకాని మే30 ప్రజాజ్యోతి :** మండల పరిధిలోని తిరుమలాపురం బస్టాండ్ (స్టేజి )వద్ద జీవనోపాధి సాగిస్తున్న తిమినేనిపాలెం గ్రామానికి చెందిన షేక్ బాబా షాప్ కు మొక్కజొన్న పంటకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు అంటించారు.ఆ మంటలు చలరేగి బాబా పంచర్ షాప్ కు అంటుకొని షాపు పూర్తిగా దగ్ధమై జీవన ఉపాధి కోసం తెచ్చుకున్న సామాగ్రి ఎయిర్ కంప్రెసర్,బోల్ట్ మిషన్స్,టైర్లు,ట్యూబులు, పైపులు,తదితర సామాన్లు సుమారు లక్ష రూపాయలు వస్తువులు కాలిపోవడంతోకన్నీరు మున్నీరు అయ్యాడు,అధికారులు స్పందించి వేంటనే ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

## పొగాకు దూరంగా ఉండండి- ఆరోగ్య కరమైన జీవితాన్ని గడపండి

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ,డాక్టర్ డి రామారావు



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని,శనివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ ఆరోగ్య సంస్థలు, గ్రామీణ ప్రాంతాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని,ఈ సందర్భంగా జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి,డాక్టర్ డి రామారావు,మాట్లాడుతూ పొగాకు వినియోగం క్యాన్సర్,గుండె జబ్బులు,పక్షవాతం, శ్వాసకోశ వ్యాధులు వంటి అనేక ప్రాణాంతక వ్యాధులకు ప్రధాన కారణమని తెలిపారు. సిగరెట్లు, బీడీలు, గుట్కా, ఖైనీ, పాన్ మసాలా వంటి పొగాకు ఉత్పత్తుల వినియోగం వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండా కుటుంబ ఆర్థిక పరిస్థితిపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు .ప్రత్యేకంగా యువత పొగాకు అలవాట్లకు దూరంగా ఉండాలని,విద్యార్థులు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు .పొగాకు వినియోగాన్ని పూర్తిగా మానివేయడం ద్వారా క్యాన్సర్ మరియు ఇతర దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చని తెలిపారు.ఈ సందర్భంగా ఆరోగ్య సిబ్బంది ర్యాలీలు, ప్రతిజ్ఞ కార్యక్రమాలు, ఆరోగ్య విద్యా సదస్సులు నిర్వహించి ప్రజలకు పొగాకు వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించాలీని,పొగాకు వినియోగాన్ని మానుకోవాలనుకునే వారికి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో అవసరమైన సలహాలు, వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు.

## మంగళస్నానాలు వేడుకలు పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు



**చింతకాని మే 30 ప్రజా జ్యోతి :** మండల పరిధిలో తిర్లాపురం గ్రామంలోని గోదా రామారావు సరిత దంపతులకు కుమార్తె సుష్మాస్వరాజ్ వారి ఇంటి ఆవరణంలో మంగళ స్థానాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తిర్లాపురం గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు తిర్లాపురం బిఆర్ఎస్ నాయకులు హాజరై సుష్మా స్వరాజ్ ను అక్షింతలేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో తిర్లాపురం గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు,తిర్లాపురం బిఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు గోగుల నరసింహారావు, ఓయూ బిసి అధ్యక్షుడు గోదా రవీందర్, గోదా వెంకన్న, చాపల మడుగు సైదులు, సువర్ణ కంటి నాగేశ్వరావు, బంధువులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కారుణ్య హృదయంతో సేవా దృక్పథం అలవర్చుకోవాలి

- మరియ తల్లి స్ఫూర్తితో మరియదళం సేవలు అందించాలి.
- ప్రభువు చూపిన మార్గం అందరికీ అనుసరణీయం.
- ఉమ్మడి జిల్లా బిషప్ డాక్టర్ సగిలి ప్రకాష్.
- నేత్రపర్వంగా పాలేరు మరియతల్లి తేరుప్రదక్షిణ .
- ముగిసిన అద్భుతాల మేరీ మాత మహోత్సవాలు.





**పాలేరు ఆర్.సీ మే30 ప్రజా జ్యోతి** దైవ మాత మరియతల్లి స్ఫూర్తితో కారుణ్య హృదయంతో సేవా దృక్పథం అలవర్చుకోవాలని భక్తులకు ఉమ్మడి జిల్లా ఆర్ సి ఎం బిషప్ డాక్టర్ సగిలి ప్రకాష్ పిలుపునిచ్చారు. పాలేరు లో అద్భుతాల మేరీమాత పుణ్యక్షేత్రం మహోత్సవాల ముగింపు వేడుకలలో బిషప్ డాక్టర్ సగిలి ప్రకాష్ ముఖ్యఅతిథిగా పాల్గొని దైవ సందేశాన్ని అందించారు. పాలేరు విచారణ గురువు ఫాదర్ కొమ్ము ఆంతోనీ ఆధ్వర్యంలో తొలుత మరియతల్లి తేరుప్రదక్షిణ కన్నుల పండుగగా జరిగింది. కోలాట బృందం, డప్పు వాయిద్యాలు, మంగళ వాయిద్యాలతో మరియతల్లి స్వరూపంతో పాలేరులో నేత్రపర్వంగా మరియతల్లి తేరుప్రదక్షిణ జరిగింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు ఈ మరియతల్లి తేరుప్రదక్షిణలో పాల్గొని బిషప్ డాక్టర్ సగిలి ప్రకాష్ కు ఘన స్వాగతం పలికారు. అనంతరం పాలేరు విచారణ గురువు ఫాదర్ కొమ్ము ఆంతోనీ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన నిర్వహించిన అనంతరం బిషప్ డాక్టర్ సగిలి ప్రకాష్ దైవ సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా బిషప్ డాక్టర్ సగిలి ప్రకాష్ మాట్లాడుతూ మరియతల్లి అందించిన స్ఫూర్తితో భక్తులు సేవలందించాలని కోరారు. పాలేరు పుణ్యక్షేత్రం కేంద్రంగా మరియదళం ఉమ్మడి జిల్లాలో ప్రత్యేకంగా సేవలు అందించేందుకు ముందుకు రావడం హర్షనీయమన్నారు. ఏసుప్రభు చూపిన మార్గం అందరికీ అనుసరణీయం అని తెలియజేశారు. క్షమా, సమాధానం, పరోపకార లక్షణాలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని తెలియజేశారు. కారుణ్య హృదయంతో తోటివారిపట్ల ఆత్మీయతతో మెలగాలని కోరారు. పాలేరులో 76 అడుగుల మేరీమాత స్వరూపం ఆసియా ఖండంలోనే ప్రసిద్ధి చెందడం, ఈ పుణ్యక్షేత్రంలో విశ్వాసులకు మరియతల్లి ఎన్నెన్నో అద్భుత క్రియలతో ఆశీర్వాదాలను అందించారని పేర్కొన్నారు. పాలేరు విచారణ గురువు ఫాదర్ కొమ్ము ఆంతోనీ మాట్లాడుతూ పాలేరు పుణ్యక్షేత్రం లో ఎన్నెన్నో అద్భుతాలు జరిగాయని ఈ పుణ్యక్షేత్రాన్ని దర్శించుకుని భక్తితో ప్రార్ధనలు చేసిన వారికి మరియతల్లి ఎన్నెన్నో ప్రయోజనాలను అందించారని తెలిపారు. ఇటీవల ఒక మహిళా భక్తురాలికి 21 సంవత్సరాల తర్వాత పండంటి బిడ్డను మరియతల్లి అందించడం అద్భుత ప్రక్రియ అని తెలిపారు. ఇటువంటి అద్భుతాలు ఈ పుణ్యక్షేత్రంలో ప్రతిభక్తునికి సంతృప్తినిచ్చాయని తెలియజేశారు. అనంతరం ఆధ్యాత్మిక , సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఈ కార్యక్రమంలో ఫాదర్ నందిగామ మారియో, బ్రదర్ బాలరాజు, ఫాదర్ కొరివి థామస్ , ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన మత గురువులు, సిస్టర్స్ , బ్రదర్స్, విశ్వాసులు పాల్గొన్నారు.

# వంద పడకల ఆసుపత్రి విద్యుత్ లైన్ రోడ్డు వెంట ఏర్పాటు చేయాలి

- ఏడీఈ, ఏఈలకు వినతిపత్రం అందజేసిన రైతులు



**పాలేరు ఆర్.సి మే 30 ప్రజా జ్యోతి** కూసుమంచి మండలం గంగబండ తండా శివారులో నిర్మితమవుతున్న వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రికి విద్యుత్ సరఫరా కోసం ప్రతిపాదించిన లైన్‌ను రైతుల వ్యవసాయ భూముల మీదుగా కాకుండా రహదారి వెంట టవర్లు ఏర్పాటు చేసి తీసుకెళ్లాలని స్థానిక రైతులు విద్యుత్ శాఖ అధికారులను కోరారు. ఈ మేరకు శనివారం కూసుమంచి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏడీఈ,వెంకట్ ఏఈలను కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రస్తుతం ఆసుపత్రికి విద్యుత్ లైన్‌ను సబ్ స్టేషన్ నుండి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమీపంలోని వ్యవసాయ భూముల గుండా తీసుకెళ్లే ప్రతిపాదన ఉందని రైతులు తెలిపారు.ఇప్పటికే తమ భూముల్లో ఎస్సారెస్పీ కాలువలు, మిషన్ భగీరథ కరెంట్ లైన్లు, విద్యుత్ స్తంభాలు ఉండటంతో సాగు భూమి విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మరింత నష్టం జరగకుండా క్యాంపు కార్యాలయం ముందు నుంచి ప్రధాన రహదారి వెంట విద్యుత్ టవర్లు ఏర్పాటు చేసి లైన్‌ను తీసుకెళ్లాలని కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన అధికారులు రైతుల అభ్యర్థనను ఉన్నతాధికారులు, మంత్రి దృష్టికి తీసుకెళ్లి తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అర్వపల్లి మొగులయ్య, హోంగార్డ్ అర్వపల్లి శ్రీనివాస్ గౌడ్, అర్వపల్లి నరేష్ గౌడ్, అర్వపల్లి జనార్దన్ గౌడ్, భారీ వీరభద్రం, విజయ్‌పాల్, బెల్లంకొండ రనీల్, అర్వపల్లి వెంకటేశ్వర్లు, జగ్గు, తదితర రైతులు పాల్గొన్నారు.

# సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

- లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసిన కర్నాటి
- పేదల సంక్షేమం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుంది
- కాంగ్రెస్ పార్టీ బోనకల్ మండల అధ్యక్షులు కర్నాటి రామకోటేశ్వరరావు



**బోనకల్ ,మే 30(ప్రజా జ్యోతి):** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సిఫారసు మేరకు బోనకల్ పార్టీ కార్యాలయంలో శనివారం సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. బోనకల్ మండల అధ్యక్షులు శ్రీ కర్నాటి రామకోటేశ్వరరావు చేతుల మీదుగా లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారుల వివరాలు... బోనకలకు చెందిన గుగులోతు లక్ష్మి –₹36,000/–, గద్దె ఉదయ శ్రీ –₹12,500/– , గుగులోతు గోపమ్మ₹18,500/–, అంతోటి కమలమ్మ₹41,000/–,మరీదు శివ కృష్ణ ₹35,000/– , అంతోటి త్రివేణి – ₹26,500/, బదావత్ నాగమణి ₹28,000/–, మొత్తం ₹1,97,500/– రూపాయలు పంపిణీ చేసినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కర్నాటి రామకోటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేదల సంక్షేమం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని, ఎన్నికల్లో చెప్పిన ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ పార్టీ తప్పక అమలు చేస్తుందని ఈ సందర్భంగా తెలియజేశారు. లబ్ధిదారులు మాట్లాడుతూ.. పేదలకు అండగా నిలుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి, సిఫారసు చేసిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కి, చెక్కులు పంపిణీ చేసిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కర్నాటి రామకోటేశ్వరావుకి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోనకల్ గ్రామ క్లస్టర్ ఇంచార్జ్ సుబ్బారావు , మధిర నియోజకవర్గ గాంధీ పథం కన్వీనర్ పాసంగులపాటి కోటేశ్వరరావు , బోనకల్ శివాలయ చైర్మన్ యార్లగడ్డ శ్రీనివాసరావు ,నాయకులు అంతోటి వెంకటేశ్వర్లు ,పురుషోత్తం ,రావినూతల గ్రామ సర్పంచ్ భూక్య భద్రు నాయక్ , బోనకల్ మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు మరీదు శ్రీనివాసరావు , బోయినపల్లి నరేష్ , యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు జనప్రియ కుమార్ , మండల కిసాన్ సెల్ అధ్యక్షులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# బిక్షాటన చేస్తూ వివోఏల వినూత్న నిరసన





**ఎర్రుపాలెం ప్రజాజ్యోతి** మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయం వద్ద జరుగుతున్న వివోల నిరసన కార్యక్రమం శనివారానికి 13వ రోజుకు చేరుకుంది వివోలు తమ హక్కుల కోసం పోరాడుతూ చేస్తున్న ఈ ధర్నాలో శనివారం వినూత్నంగా భిక్షాటన చేస్తూ వివో లు తమ నిరసన వ్యక్తం చేశారు ప్రధానంగా కనీస వేతనం 20000 పెంచాలని ఉద్యోగ భద్రత కల్పించాలని సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి అర్హులైన వివో లను సీసీలుగా గుర్తించాలని వారు ప్రభుత్వానికి డిమాండ్ చేస్తున్నారు ఇకనైనా మా ఆవేదనను ప్రభుత్వం ప్రభుత్వ అధికారులు అర్థం చేసుకొని తమ సమస్యలను పరిష్కరించాలని వారు కోరినారు ఈ కార్యక్రమంలో అధ్యక్ష ఉపాధ్యక్షులు కనకదుర్గ రాణి హేమలత జ్యోతి సరోజిని ఏడుకొండలు సుజాత పద్మ దుర్గా భవ్య నాగమణి జ్యోతి సైదమ్మ వెంకటేశ్వరమ్మ నాగమణి కమలమహాలక్ష్మి పద్మజ పద్మ స్వర్ణ లత సూర్యకళ స్వప్న జ్యోతి రమణ స్వాతి వినాయకుమారి వజ్రకుమారి వరలక్ష్మి త్రివేణి కనక దుర్గా కృష్ణవేణి కనక దుర్గ తదితరులు పాల్గొన్నారు

# వివోఏల సమ్మెకు తెలుగుదేశం పార్టీ మద్దతు



**చింతకాని మే30 ప్రజాజ్యోతి ప్రతినిధి** :మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎదుట 12 రోజులుగా వివోఏ లు శాంతియుత నిరవధిక సమ్మె చేస్తున్న వారికి చింతకాని మండల తెలుగుదేశం పార్టీ బృందం సంపూర్ణ మద్దతు తెలియజేసినది ఈ సందర్భంగా మండల టిడిపి అధ్యక్షులు తేలుకుంట్ల శ్రీనివాస్ రావు మాట్లాడుతూ గత 28 సంవత్సరాలుగా చాలీ చాలని 5000 రూపాయలు వేతనంతో గ్రామ దీపికలు పనిచేస్తున్నారని వారి కుటుంబాలు ఈ జీతాలు సరిపోక తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని వారికి కనీస వేతనం నెలకు 20,000 రూపాయలు ఇవ్వాలని అలాగే సామాజిక భద్రత కింద వారి కుటుంబానికి బీమా సౌకర్యం వర్తింపచేయాలని సీనియర్లు గా పనిచేస్తూ హైయర్ ఎడ్యుకేషన్ నటువంటి వారిని సెర్ప్ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఎందు సీసీలుగా ప్రమోషన్ ఇవ్వాలని జీవో నెంబర్ 58 ని సవరించాలని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం వారి న్యాయమైన డిమాండ్లు పట్ల సానుకూలంగా స్పందించాలని ఆయన కోరారు ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు మరియు పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మాత్యులు వీరి యొక్క కనీస డిమాండ్లు నెరవేర్చి వీరిని ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు ఈ కార్యక్రమంలో మండల తెలుగు రైతు నాయకులు పెంట్యాల రామారావు తెలుగుదేశం పార్టీ నాయకులు గురజాల మాధవరావు నెల్లూరు శేషగిరి మల్లాది వెంకట సుధాకర్ వంకాయలపాటి రాధాకృష్ణ తదితర నాయకులు పాల్గొని గ్రామదీపికలకు సంఘీభావం తెలిపినారు